# రాబడి చదువులు

- ప్రైవేటు పాఠశాలల్లో సెపరేటు చదువు
- ఎస్‌సీఈఆర్‌టీ పుస్తకాలతో పనిలేదు
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు


విక్రయాలను అడ్డుకుంటున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

బాలాజీచెరువు: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సమాంతర చదువులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా ముద్రించిన పాఠ్య పుస్తకాలనే అన్ని యాజమాన్యాల పరిధిలోని స్కూళ్లలో వినియోగించాలని స్పష్టం చేసింది. ప్రైవేట్ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సకాలంలో సేరఫరా చేసేలా ప్రజాశక్తి ప్రింటర్స్, విశాలాంధ్ర సమితి ద్వారా ముద్రణకు అవకాశం కల్పించారు. ఇక్కడ ఎంపిక చేసిన దుకాణాల్లో పుస్తకాలు విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల వారు పాఠ్యపుస్తకాల కొనుగోలుకు ముందుకు రావడం లేదు. పాఠ్యపుస్తకాలు కావాలని చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేసుకోవాలని సూచించినప్పటికీ వారికి ఏమీ పట్టడం లేదు. కాకినాడ నగరంలో 128, రూరల్ 76 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో కనీసం 30 శాతం కూడా నమోదు చేసుకోలేదు.

**సొంత పుస్తకాలకు వీల్లేదు**

ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లలో తప్పనిసరిగా ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన పాఠ్యపుస్తకాలతోనే బోధన సాగాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొన్ని కార్పొరేట్ స్కూళ్లలో ఎస్‌సీఈఆర్‌టీ సిలబస్ కాకుండా తమ సొంత సిలబస్‌తో పుస్తకాలు ముద్రించి వాటిని విద్యార్థులతో కనుగోలు చేయిస్తున్నారు. నగరంలో కొన్ని పేరొందిన పాఠశాలలు సొంతంగా ముద్రించిన పుస్తకాలనే విక్రయిస్తున్నారు. ఒకటో తరగతి పుస్తకాలకు రూ.5 వేలకు పైగా వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

**నిర్ణీత ధరలకే పుస్తకాలు..**

విద్యార్థులకు నిర్ణీత ధరలకే పాఠ్య పుస్తకాలు అందుబాటు ఉంటూ, విక్రయించేలా ఏర్పాట్లు చేశారు. ఒకటో తరగతి రూ.399, రెండో తరగతి 425, మూడో తరగతి రూ.675, నాలుగో తరగతి రూ.702, ఐదో తరగతి రూ.727, ఆరో తరగతి రూ.747, ఏడో తరగతి రూ.871, ఎనిమిదో తరగతి రూ.1,181, తొమ్మిదో తరగతి రూ.1.167, పదో తరగతి రూ.859గా నిర్ణయించారు. దుకాణాల్లోనే ఎంఆర్‌పీకి విక్రయించాలని విద్యాశాఖ ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేశారు.


ప్రైవేట్ పాఠశాలలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పుస్తకాలు

### నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు..



ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు నిర్వహిస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాం, బెల్టు, షూస్ వంటి వివిధ రకాల వస్తువులను ప్యాకేజీ రూపంలో విక్రయించి దాదాపు రూ.10 నుండి రూ.15 వేలు వసూలు చేస్తున్నారు. ఒక పక్క అధికంగా ఫీజులు వసూలు చేస్తూ దానికి తోడుగా ఈ విధమైన లాభసాటి వ్యాపారాన్ని ప్రైవేటు విద్యా సంస్థలు వాటి ప్రాంగణాల్లోనే నిర్వహిస్తున్నారు. ఇటీవల ఉన్నతాధికారులు నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి వారు వచ్చి విక్రయాలు నిలిపివేశారు.

– ఎం.గంగా సూరిబాబు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

### అందుబాటులో పాఠ్య పుస్తకాలు

ప్రవేట్ పాఠశాలల్లో ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన పాఠ్య పుస్తకాలనే వినియోగించాలి. ఎంపిక చేసిన దుకాణాల్లో నిర్ణీత ధరలకు అవి అందుబాటులో ఉన్నాయి. ఏ పాఠశాలా కూడా సొంత ముద్రణ పుస్తకాలు విక్రయించరాదు. అలాగే అధిక ధరలు వసూలు చేసి సొంత పుస్తకాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– చెవ్వూరి రవి, ఎంఈఓ, కాకినాడ

## వికసిత్ భారత్ లక్ష్యంగా అడుగులు

బోట్‌క్లబ్: వికసిత భారత్ లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో తొలిసారి 2014లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పుడు 11వ స్థానంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం నాలుగో స్థానానికి చేరడం అభినందనీయమన్నారు. 18 వేల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామని, ఇంకా రోడ్లు, జాతీయ రహదారి వంటివి నిర్మించామన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మారిందని చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మొసలగంటి సురేష్, గౌతు చిన్న పాల్గొన్నారు.

## 67.27 లక్షల మందికి తల్లికి వందనం

కాకినాడ సిటీ: జిల్లాలో 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ వెల్లడించారు. మంగళవారం కాకినాడ టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పథకాలను ఒకొక్కటిగా అమలు చేస్తున్నట్టు వివరించారు.

## ఆర్‌ఓగా నూకరాజు



సామర్లకోట: స్థానిక మున్సిపల్ రెవెన్యూ అధికారిగా నూకరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఆర్వోగా విధులు నిర్వహిస్తున్న శ్యామల పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఇటీవల బదిలీల్లో భాగంగా పెదాపురం మున్సిపాలిటీలో పని చేస్తున్న నూకరాజును సామర్లకోట ఆర్వోగా బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

## క్లుప్తంగా

### భావనారాయణుని భూముల ఆక్రమణల పరిశీలన


భావనారాయణుని భూముల ఆక్రమణలను పరిశీలిస్తున్న ఏసీ నాగేశ్వరరావు తదితరులు

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామికి చెందిన భూముల్లో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను అధికారులు మంగళవారం పరిశీలించారు. ఆలయ మాజీ చైర్మన్ పుల్ల శ్రీరాములు (శ్రీను) ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో గ్రీవెన్స్‌లో చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దేవదాయ శాఖ ఏసీ నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ తదితరులు సర్పవరంలో పలు నిర్మాణాలను పరిశీలించారు. పూల మార్కెట్ ఎదురుగా భవన నిర్మాణం, సచివాలయం ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలు, రహదారి ఆక్రమణ, తదితర ప్రాంతాలను పరిశీలించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని వారు తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### బాల కార్మికు వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్


బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల సంక్షేమాధికారి వెంకట్రావు

కాకినాడ రూరల్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో స్థానికులకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. చిన్నారుల హక్కులను హరిస్తున్న ఈ వ్యవస్థ నిర్మూలనకు ఈ నెల 30 వరకు వాణిజ్య సంస్థలు, షాపులను తనిఖీ చేస్తామన్నారు. పలక, బలపం పట్టాల్సిన చేతులు ఇటుక బట్టీలు, కార్ఖానాలు, హోటళ్లు తదితర వాణిజ్య దుకాణాల్లో బందబారుతున్నాయని, బాలలు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. బాలలకు విద్య, ఆరోగ్యం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం శిక్షార్హులవుతానన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టరు శిరీష, రేలంగి బాపిరాజు, ప్రసాద్ నాయుడు, పాల్గొన్నారు.

### వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ


సర్పవరం జంక్షన్‌లో వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లోని వీధి వ్యాపారులకు లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో మంగళవారం గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు ఎస్‌వీఎస్‌ఎల్ ప్రసూన మాట్లాడుతూ వేసవి, వర్షాకాలాల్లో వీధి వ్యాపారులకు ఉపయోగపడేలా పెద్ద సైజు గొడుగులను అందించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శ్రీదేవి రెడ్డి, మీనాక్షి, ప్రసూన, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### సుఖీభవ పథకానికి నేడే చివరి అవకాశం

గొల్లప్రోలు వ్యవసాయ శాఖాధికారి సత్యనారాయణ



పిఠాపురం: అన్నదాత సుఖీభవకు అర్హులైన రైతులు ఈకేవైసీ చేయించుకోడానికి బుధవారం తుది గడువని గొల్లప్రోలు వ్యవసాయ శాఖాధికారి కేవీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గొల్లప్రోలు మండలంలో వివిధ గ్రామాల నుంచి అన్నదాత సుఖీభవకు ఎంపికైన వారు 8,639 మంది రైతులు ఉండగా ఇప్పటివరకు 8,357 మంది ఈకేవైసీ చేయించుకున్నట్లు ఆయన తెలిపారు. వివిధ గ్రామాల నుంచి ఈకేవైసీ చేయించుకోవాల్సిన వారు ఇంకా 278 మంది ఉన్నారన్నారు. వారందరూ వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీన అన్నదాత సుఖీభవ రైతులకు వారి బ్యాంకు ఎకౌంటులలో నగదు జమ అవుతుందన్నారు. ఈకేవైసీ అవ్వక పోతే అన్నదాత సుఖీభవ పథకం వర్తించదని, వారు అనర్హులుగా గుర్తించబడతారన్నారు. పథకం రాక ఇబ్బంది పడే కంటే ముందుగా అందరు రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో యోగా శిక్షణ


పరివర్తనలో యోగసనాలు వేస్తున్న విద్యార్థులు

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో మంగళవారం విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. యోగాంధ్ర - 2025లో భాగంగా యోగా శిక్షకుడు ఆనందమార్గ ప్రచారక్ ఆచార్య ప్రమానంద అవధూత్ యోగాసనాలు గురించి వివరించారు. ఒత్తిడిని జయించేందుకు, మానసిక ఉల్లాసానికి యోగా సాధన ఉత్తమమని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రశాంతి శ్రీ, వాసంశెట్టి రామ్‌గోపాల్ పాల్గొన్నారు.


పీజీ సెంటర్‌లో యోగా శిక్షణ ఇస్తున్న ఆచార్య ప్రమానంద అవధూత్

**యోగాతో సంపూర్ణ ఆరోగ్యం**

బోట్‌క్లబ్: ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని పరివర్తన వీధిబాలల పునరావాస కేంద్రం నిర్వాహకులు వక్కలంక రామకృష్ణ అన్నారు. స్థానిక భాస్కర్‌నగర్‌లోని పరివర్తన వీధిబాలల పునరావాస కేంద్రంలో మంగళవారం విద్యార్థులు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత వస్తుందన్నారు. విద్యార్థులకు యోగసనాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 50 విద్యార్థులు యోగాసనాలు వేశారు.

## ధర్నా చేసినందుకు జరిమానా

పిఠాపురం: పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన కేసులో 17 మందికి రూ.1,700 జరిమానా విధిస్తూ పిఠాపురం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.వెంకట అపర్ణ మంగళవారం తీర్పు చెప్పారు. 2019 నవంబరు 29 రాత్రి గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన బండి దుర్గాభవాని తనను ఎస్.నాగేశ్వరరావు వివాహం చేసుకుంటానని మోసగించాడని, పెళ్లి చేయాలని స్టేషన్ ఎదుట నిరసనకు దిగగా, మద్దతుగా ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు బైఠాయించారు. ట్రాఫిక్ స్తంభించి ఇబ్బంది కలగడంతో, అప్పటి ఎస్సై రామలింగేశ్వరరావు 17 మందిపై కేసు నమోదు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినందుకు ముద్దాయిలకు ఒక్కొక్కరికీ రూ.100 చొప్పున మొత్తం రూ.1,700 జరిమానా విధిస్తూ అదనపు మేజిస్ట్రేట్ వి. వెంకట అపర్ణ తీర్పునిచ్చారు.

## కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరవు

పిఠాపురం: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందనడానికి నిదర్శనం నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కుప్పంలో మహిళపై జరిగిన ఘటనేనని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం మహిళపై జరిగిన దాడిని ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. చిత్తూరు జిల్లా కుప్పంలో ఓ టీడీపీ కార్యకర్త మహిళను నడి రోడ్డుపై అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, రోడ్డుపై ఈడ్చుకుని వెళ్లి తాళ్లతో చెట్టుకు బంధించి చిత్రహింసలకు గురి చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు ఏకంగా ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఆయన అనుచరులే పాల్పడడం దారుణమన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని మహిళలకు, అమ్మాయిలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దీనికి కచ్చితంగా కూటమి నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## టిడ్కో రుణానికి తల్లికి వందనం జమ!

- రుణ వాయిదాల కోసం
- బ్యాంకు అధికారులు వేధింపులు
- కమిషనర్‌కు లబ్ధిదారుల మొర


కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న మహిళలు

సామర్లకోట: స్థానిక టిడ్కో గృహ సముదాయంలో నివసిస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య చాంబర్‌లో ఉప్పువారి సత్రం వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయ వాసులు వారి సమస్యలను వివరించారు. అనేక మందికి ఇళ్లను స్వాధీనం చేయలేదని, అయితే బ్యాంకు రుణం మంజూరు కావడంతో వాయిదాలు చెల్లించాలని బ్యాంకుల అధికారులు వేధిస్తున్నారని మహిళలు వాపోయారు. ఇంటిని అప్పగించకుండా సొమ్ములు ఎలా చెల్లించాలని మెప్మా అధికారులను ప్రశ్నించగా, ఇళ్ల స్వాధీనం చేసుకునే వరకు వాయిదాలు చెల్లించాల్సిన పని లేదని చెప్పారని మహిళలు కమిషనర్‌కు తెలిపారు. ఇటీవల టిడ్కో సముదాయానికి వచ్చిన ప్రజా ప్రతినిధుల సూచన మేరకు బ్యాంకు వాయిదాలను చెల్లించలేదని మహిళలు తెలిపారు. ఇటీవల తల్లికి వందనం మంజూరు కావడంతో బ్యాంకు ఖాతాల్లో నిల్వ లేదని మహిళలు వాపోయారు. ఇదేమిటని బ్యాంకు అధికారులను ప్రశ్నిస్తే టిడ్కో రుణం వాయిదాగా జమ చేసుకున్నట్టు చెప్పారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకంలో మంజూరైన సొమ్ము ఈ విధంగా జమ చేసుకోవడం ఎంత వరకు సమంజసమని మహిళలు ప్రశ్నిస్తున్నారు. బ్యాంకుకు సొమ్ము చెల్లించాలా లేదా చెప్పాలని మహిళలు కమిషనర్‌ను ప్రశ్నించారు. అయితే ప్రభుత్వ పాలసీ రావాల్సి ఉన్నదని, అప్పటి వరకు వాయిదాలు చెల్లించాలని తెలిపారు. టిడ్కో సముదాయంలో తాగునీరు రావడం లేదని, లైట్లు వెలగడం లేదని, తుప్పలు పెరిగిపోవడం వలన పాములు వస్తున్నామని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ఈ సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ శ్రీవిద్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కౌన్సిలర్ బలుసు వాసు, మాజీ కౌన్సిలర్ సూర్యనారాయణ, మాదిగ సంక్షేమ సంఘ నాయకుడు కాపవరపు కుమార్ పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ హామీలు గాలికి


జగన్ అంటే నమ్మకం, బాబు అంటే మోసం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సాయి ప్రసాద్

- మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్
- జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబంటే మోసం కరపత్రాల ఆవిష్కరణ

పెద్దాపురం: చంద్రబాబు ఏడాది పాలన అంతా అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడమే అజెండాగా సాగిందని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. స్థానిక వైస్ చైర్మన్ నివాసంలో మంగళవారం ఏడాది పాలనపై వైఎస్సార్ సీపీ ముద్రించిన వెన్నుపోటు పుస్తకాన్ని ఆయన పట్టణ కౌన్సిలర్లతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి ఏడాదిగా కాలయాపన చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ మెనిఫెస్టో ఎలా అమలైందో, కూటమి ప్రభుత్వం మెనిఫెస్టో ఎలా అమలవుతోందో ప్రజలు గమనించాలన్నారు. వైఎస్ జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అని ప్రజలు తెలుసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సుమారు 140 హామీల ఊసేలేదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. అనంతరం కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్, పట్టణ పార్టీ అధ్యక్షులు కాపగంటి కామేశ్వరరావు, అగ్రో మాజీ డైరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్లు ఆరెళ్ళి వీర్రాఘవులు, ఆకుల కృష్ణ బాపూజీ, కట్టా రాజుబాబు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, గుర్రాల యాకోబు, పప్పల బుజ్జి, బొబ్బిలి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవుని సన్నిధిలో కలెక్టర్ దంపతులు


సత్యదేవుని ఆలయంలో కలెక్టర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న పండితులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయాన్ని మంగళవారం కలెక్టర్ షణ్మోహన్ దంపతులు దర్శించి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులు వేదాశీస్సులు అందచేయగా ఈఓ వీర్ల సుబ్బారావు స్వామివారి ప్రసాదాలు అందజేశారు. దేవస్థానంలో భక్తుల సౌకర్యాల గురించి ఆయన ఈఓను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఏఈఓ కృష్ణారావు, విశ్రాంత ఆర్‌ఐ ప్రసాద్ తదితరులున్నారు.

## వ్యవసాయ రంగంపై అక్కసు


కియోస్క్‌తో సమాచారం తెలుసుకోవడంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

- అలంకారప్రాయంగా రైతుసేవా కేంద్రాలు
- కియోస్క్ సేవలను నిలిపివేసిన ప్రభుత్వం
- నిరుపయోగంగా యంత్రాలు

కొత్తపల్లి: వ్యవసాయంలో రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు బుక్ చేసుకునేందుకు, అలాగే వాతావరణ సమాచారాన్ని బట్టి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకునే వెసులుబాటును కియోస్క్ యంత్రాల ద్వారా తెలుసుకునేలా అందుబాటులోకి తీసుకువచ్చారు. భూసార పరీక్ష నుంచి అధిక దిగుబడి సాధించేందుకు అవసరమైన అన్ని రకాల సేవలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా రైతన్నలు కియోస్క్ సేవలను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకున్నారు. మండలంలో 10,254 ఎకరాల్లో సాగు చేస్తుండగా, సుమారు 6,073 మంది రైతులు ఉన్నారు.

**మూలకు చేరిన యంత్రాలు**

రైతులకు మేలు చేసే ఏ అంశాలనైనా కొనసాగించాల్సిన బాధ్యత తరువాత అధికారంలోకి వచ్చే ప్రభుత్వానికి ఉంటుంది. అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైన వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరిస్తోంది. రైతుకు పెట్టుబడి సాయం అందించకపోవడంతో ఖరీఫ్, రబీ సీజన్లలో అప్పులు చేసుకొని సాగుకు సమాయత్తం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్తపల్లి మండలలో 24 గ్రామ సచివాలయాలకు 21 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 19 కియోస్క్ యంత్రాలు ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఒక్కొక్క యంత్రం ఏర్పాటుకు రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యానికి మండలంలో ఆ విలువైన యంత్రాలు మూలన చేరాయి.


అమినాబాద్‌లో నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు

## ఏలేరులో తగ్గుతున్న నీటినిల్వలు

ఏలేశ్వరం: మే నెల నుంచే వర్షాలు పడుతున్నా ఆశించిన స్థాయిలో ఏలేరుకు వరద ప్రవాహం రాకపోవడంతో జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా తగ్గుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి నీటి సరాఫరా అంతంతమాత్రంగా ఉండడంతో ప్రస్తుతం నీటినిల్వలు క్రమంగా తగ్గుతున్నాయి. దిగువప్రాంతంలో సాగు లేకపోవడంతో ఆయకట్టుకు నీటి సరాఫరా నిలిపివేశారు. దీంతో మంగళవారం నాటికి ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు 76.51 మీటర్లు, 24.11 టీఎంసీలకు 9.71 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి విశాఖకు 150 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. పంపా, తిమ్మరాజు చెరువుకు నీటి సరాఫరా నిలిపివేశామని ప్రాజెక్ట్ అధికారులు వెల్లడించారు.

## నేటి బాలలే రేపటి పౌరులు

ప్రత్తిపాడు రూరల్: నేటి బాలలే రేపటి పౌరులని ఆ దిశగా పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. మండలంలోని పోతులూరు అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అనంతరం సూపర్‌వైజర్ మాట్లాడుతూ చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొండి రాంబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.